ఔను.. తెలంగాణ ప్రజలకు, ప్రయోజనాలకు గుమస్తాలమే!

ఈ భూమ్మీద ఎవరి చరిత్ర వారే తయారు చేసుకుంటారు. తమ చేతల ద్వారా.. చర్యల ద్వారా.. మాటల ద్వారా..! రాజకీయాల్లో ఉన్న వారు మరీనూ! ఇక్కడ ఆత్మహత్యలే తప్ప హత్యలు ఉండవు!

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఏనాడు ఓ చెయ్యి వేయని రేవంత్‌రెడ్డి ఇవాళ నమస్తే తెలంగాణ వంటి తెలంగాణ పత్రిక మీద అవాకులు చెవాకులు పేలుతున్నాడు. అవమానిస్తున్నాడు. తనపై కుట్ర చేస్తున్నదని అంటున్నాడు. కావాలని ఏవో కథనాలు వండివార్చుతున్న దంటున్నాడు. తానన్న మాటలే రాస్తే.. తన చర్యలనే ఎత్తి చూపితే గింజుకుంటున్నాడు. గొంతు చించుకొని నోరు పారేసుకుంటున్నాడు.

నమస్తే తెలంగాణ పుట్టుక ఏమిటో... పరిణామం ఏమిటో.. తెలంగాణ భావజాల వ్యాప్తిలో.. ఆఖరికి తెలంగాణ సాధనలో దాని పాత్ర ఏమిటో ప్రజలందరికీ తెలుసు. ఇవాళ ఎవరో కొత్తగా సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. అందునా తెలంగాణ వాదుల మీదికి తుపాకులు ఎక్కుపెట్టిన వారి సర్టిఫికెట్ అంతకన్నా అవసరం లేదు.

పచ్చలాబీ వెయ్యి చేతులతో తెలంగాణ శిశువును గొంతునులమాలని ప్రయత్నిస్తున్నప్పుడు.. ఉద్యమ దీపాన్ని తుపానులా చుట్టి ఆర్పేయాలని ప్రయత్నిస్తున్నప్పుడు.. చేతులు బొబ్బలెక్కినా లెక్క చేయకుండా ఆ దీపాన్ని ఆరకుండా అడ్డుకున్న చరిత్ర నమస్తేది! తెలంగాణ మీద అణచివేతను, రాష్ట్ర సాధన ఆవశ్యకతను పేగులు తెగేదాక గొంతెత్తి చాటిన ఘనత నమస్తేది. సీమాంధ్రుల కుట్రలకు ధైర్యం జారిపోయే స్థితిలో ప్రజలకు కుట్రలను విడమరిచి చెప్పి ఉద్యమాన్ని ప్రజ్వరిల్లజేసిన చరిత్ర నమస్తేది. తెలంగాణ అనే ఉద్యమ బీజం నాటిన నాటినుంచి నేటిదాకా ‘నమస్తే తెలంగాణ’ తెలంగాణ ప్రయోజనాల వైపే నిలబడింది. ఉద్యమానికి ఊతమిచ్చి ద్విగుణీకృతం చేసింది. వందల ఏండ్ల తెలంగాణ మహోన్నత చరిత్రను తవ్విపోసింది. తెలంగాణ ఘనతను, తెలంగాణ సాహిత్యాన్ని, సంస్కృతిని, పూర్వవైభవాన్ని.. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణను ఆవిష్కరించి ఉద్యమకారుల గుండెల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఆంధ్ర సర్కారు చేసే ప్రతి కుట్రను ప్రజలకు విడమరిచి చెప్పి వారిని జాగరూకులను చేసింది. కర్తవ్య బోధన చేసింది. ఉద్యమం పొడవునా అండదండలు అందించింది. శ్రీకృష్ణ కమిటీ 8వ చాప్టర్ వెలికి తెచ్చి ఆఖరి నిమిషం కుట్రలను కూడా బట్టబయలు చేసింది.

ఎస్... తెలంగాణ సాధనలో మా పాత్ర ఇది అని కాలరెగరేసి, సగర్వంగా చెప్పగల చరిత్ర నమస్తేకు, ఇందులో పనిచేసిన ఉద్యోగులకు ఉంది. అసాధ్యమనుకున్న రాష్ట్ర సాధన అంశానికి భావవ్యాప్తి ద్వారా బలమైన పునాది నిర్మించి సాకారం చేసిన గొప్ప చరిత్ర మాకున్నది. అంతేకాదు... ఈ దారి పొడవునా నమస్తే ఎత్తుకున్న మార్గం సరైనదే అనేది చరిత్రే రుజువు చేసింది. ఉద్యమ కాలంలో నమస్తే అందించిన మద్దతు సరైనదేనని రాష్ట్ర సాధనతో రుజువైతే.. ఆ తర్వాత వచ్చిన తెలంగాణను బాగు చేసుకునే కృషిలో ‘రాళ్లెత్తిన’ మార్గం సరైనదేనని 2014, 2018 ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పులు రుజువు చేశాయి. వచ్చిన తెలంగాణను పీకపిసికి చంపేయాలని చూసిన శక్తులతో అంటకాగిన వారినుంచి నీతులు నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు.

నమస్తే కుట్రలు చేస్తున్నదట. రేవంత్‌రెడ్డి అంటాడు. కుట్రలు చేయడం కాదు, కుట్రలు భగ్నం చేసిన చరిత్ర నమస్తేది.

రేవంత్‌రెడ్డి తెలంగాణను అవమానపరిచాడా? లేదా? అనేది ఇవాళ మాట్లాడుకోవాల్సిన మాట కానేకాదు. ఉద్యమ సమయంలోనే తుపాకులను తెలంగాణవాదుల మీద ఎక్కుపెట్టిన చరిత్ర ఉండనే ఉన్నది. ఉస్మానియా విద్యార్థులను అడ్డా మీది కూలీలని అవమానించిన సందర్భాలున్నాయి. తెలంగాణకు కరెంటు ఆపడానికి ఆంధ్రాలో ఎంవోయూలు పాత తేదీలతో రద్దుచేసిన సాక్ష్యాలు ఎదురుగా పెట్టకొని చంద్రబాబుకు మద్దతు పలికిన చరిత్ర ఉన్నది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అక్కర్లేదు!
సీమాంధ్ర పాలకులు నీళ్లియ్యలేదా?
హైదరాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించిన్రు!
కాస్త ఎసుకో ముందో ఎప్పటికప్పుడు నియామకాలు జరుగుతూనే వచ్చినయ్.
వాటికోసమైతే తెలంగాణ అవసరం లేదు.’
సమైక్య రాష్ట్రమే బాగుండేది: రేవంత్
కేసీఆర్ చెప్పే నీళ్లు, నిధులు, నియామకాలు అనేది బీఆర్ఎస్ పొలిటికల్ పార్టీ ఎజెండా. ప్రజలెప్పుడూ నీళ్లు, నిధులు, నియామకాలు గురించి ఆలోచన చేయలే.
వలస పాలకులు నీళ్లు ఇచ్చిండ్రు.. నిధులు ఇచ్చిండ్రు.. ఉద్యోగాలిచ్చిండ్రు
అది ఉద్యమ నినాదం కాదు.. బీఆర్ఎస్ పార్టీ నినాదం..
- అమరవీరుల త్యాగాలు అవహేళన
- తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన మూడున్నర కోట్ల ప్రజలకు అవమానం
- ఇది ప్రత్యేక తెలంగాణకు చీకటిరోజు..
- వలసపాలకుల గొంతుకగా రేవంత్
- మొన్న ఏర్పాటు టెక్నికల్‌గా తప్పని నేడు రాష్ట్రమే వద్దంటున్న కాంగ్రెస్ నేత

ఇవీ టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలు
నరకాసురులతో జాగ్రత్త!
కరెంట్ 3 గంటలే చాలు
కరెంట్ కావాలా?

నమస్తే తెలంగాణ

ఆఖరికి నిన్నగాక మొన్న సమైక్య రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు రాలేదా? అని ప్రశ్నించి తెలంగాణవాదన ఉనికినే అవమానించిన సందర్భం ఉన్నది. దాన్నే నమస్తే రాసింది? కెమెరాల ముందు అడ్డగోలు మాటలు మాట్లాడి ఆ విషయం ప్రచురిస్తే ఇప్పుడు గింజుకోవడం ఎందుకు?

కర్ణాటకకు పెట్టుబడుల తరలింపు అంశం. అందరికీ తెలుసు. ఇవాళ బెంగళూరుకు హైదరాబాద్‌కు ఐటీ రంగంలో పోటీ ఉన్నది. బెంగళూరులో ఏం జరుగుతున్నదనే దాని మీద హైదరాబాద్ ఓ కన్నువేసి ఉంచుతుంది. అలాగే హైదరాబాద్ మీద బెంగళూరు కన్నువేసి ఉంచుతుంది. ఇది రెండు నగరాల మధ్య రాష్ట్రాల మధ్య పోటీయే. ఏ రాష్ట్రమైనా తన రాష్ట్రాన్ని కాపాడుకోవాలనుకుంటుంది. అందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇవాళ కనీస రోడ్‌మ్యాప్ లేకుండా కర్ణాటకలో ఓ నాలెడ్జ్ సిటీ కడుతుంటే.. దానివల్ల నష్టపోకుండా ఎవరు జాగ్రత్తపడాలి? కచ్చితంగా తెలంగాణయే. అదే నమస్తే రాసింది. కుట్ర కోణాలు చూడాలంటే నగరాలు, సౌకర్యాలే కాదు. రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులు.. నాయకుల పెత్తనాలు.. అన్నీ చూడాల్సిందే. ఇవాళ తెలంగాణ ఎన్నికలకు కర్ణాటక నుంచి 50 మందికి పైగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంచార్జిలుగా వచ్చారు. ఇక్కడి టిక్కెట్లు, చేరికలు చాలావరకు బెంగళూరులో డిసైడ్ అయ్యాయి. ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే ఈ ఎన్నికలకు ఇక్కడ ఇంచార్జిగా పనిచేస్తున్నాడు. ఎన్నికల ఖర్చులకు కర్నాటక నుంచి వందల కోట్లు డబ్బు ప్రవాహంలా వచ్చి పడుతుంది. తెలంగాణలో ఎన్నికల మీద కర్ణాటక కాంగ్రెస్ ఇంత పెట్టుబడి పెట్టిన తర్వాత ఎన్నికలయ్యాక ఏం జరుగుతుంది? కర్మగాలి కాంగ్రెసే వస్తే? ఇవాళ సాయం చేసినవాడు రేపు ఫలితం కోరుతాడు కదా? అది హైదరాబాద్ భూములా? కంపెనీల తరలింపా?.. ఏది అడిగినా కాదనే ధైర్యం ఇక్కడి కాంగ్రెస్ నాయకులకు ఉందా? కాంగ్రెస్ 70 ఏండ్ల బానిసత్వ చరిత్రను చూశాం. కాబట్టే ఈ కుట్రల కోణాన్ని ఢంకా బజాయించి ప్రజలకు చెపుతాం. అది మా కర్తవ్యం! కర్ణాటకలో మనకే సంబంధం అంటున్న రేవంత్‌రెడ్డి మరి మన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కర్ణాటక నేతల బృందాన్ని ఎందుకు దించారో చెప్పగలరా? కర్ణాటక ఏమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా?

సానుభూతి ఎవరి మీద వస్తుంది? రాష్ట్రంలో జరుగుతున్న దాడుల మీదా రేవంత్ నోరు చేసుకున్నాడు. ప్రజాస్వామ్య దేశంలో కార్యకర్తలను రెచ్చగొట్టి ఉగ్రవాదుల్లా తయారుచేసినవి ఏ పార్టీలో అందరికీ తెలుసు. ఆ విష సంస్కృతి పరిణామమే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి. ఆ తర్వాత గువ్వల బాలరాజు మీద జరిగిన దాడి. ఈ దాడినీ వక్రించే ప్రయత్నం చేశాడు. ఏదో ప్రశాంత్ కిషోర్ బీఆర్ఎస్‌లో ఉన్నట్టు ఎన్నికల్లో దాడులు చేయించి తద్వారా వచ్చే సానుభూతితో గెలిచే వ్యూహం పన్నారని ఇదేరకంగా బెంగాల్‌లో మమతా బెనర్జీ మీద దాడి జరిగిందని, ఏపీలో జగన్ మీద జరిగిందని చెప్పుకొచ్చాడు. కానీ, వాళ్లిద్దరు ఆ పార్టీకి అధినేతలు. ఇక్కడ దాడి జరిగింది ఒక ఎంపీ మీద. ఆయన మీద దాడి జరిగితే రాష్ట్రమంతా బీఆర్ఎస్‌కు ఎలా సానుభూతి వస్తుందో రేవంత్‌కే తెలియాలి. అంతేకాదు రేవంత్ ముసుగు బాస్ మీద అలిపిరిలో మందుపాతరతో హత్యాయత్నం జరిగింది. ఆ వెంటనే వచ్చిన ఎన్నికల్లో అలాంటి సానుభూతి ఏదీ రాలేదు సరికదా ఆయన అధికారమే కోల్పోయాడు. ఇంకా మాట్లాడితే ఇందిర మరణానంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నాటి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. తెలంగాణ వచ్చాక పాలేరు, దుబ్బాక ఉప ఎన్నికల్లో కూడా మరణానంతర సానుభూతి పని చేయలేదు. అయినా 2001 నుంచి తెలంగాణ ఉద్యమం నడిపిన కేసీఆర్ ఏనాడు హింసను ఆశ్రయించలేదు. టీఆర్ఎస్ చరిత్రలో ఏనాడూ హింసాత్మక సంఘటనలు లేవు. ఎదుటివారి మీద దాడులు చేసి.. వారిని లేకుండా చేసి ఎన్నికలు గెలవాలనే విధానం ఏనాడూ లేదు. ప్రత్యర్థులను తెగనరికి అడ్డు తొలగించుకోవడం వంటి సంస్కృతి రేవంత్ పాత పార్టీకి ఉంది. ఇవాళ చేరిన కొత్తపార్టీకి ఉంది. తెలంగాణలో సీఎంను దింపడానికి 400 మందిని ఊచకోత కోయించిన చరిత్రా ఉంది. దాడులు, కుట్రల గురించి రేవంత్ మాట్లాడితే జనం నవ్వుతారు.

ఇక ఎంఐఎం, బీజేపీ, బీఆర్ఎస్, జేడీఎస్ కలిసిపోయి కాంగ్రెస్ మీద కుట్ర చేస్తున్నాయని కర్ణాటక రాజకీయాలకు తెలంగాణకు ముడిపెట్టారు. ఎంఐఎంతో 50 ఏండ్లు అంటకాగింది కాంగ్రెస్ కాదా? ఇవాళ ఆ పార్టీలో బీజేపీ కనిపిస్తున్నదా? ఇక కర్ణాటక ముక్కోణపు రాజకీయంలో జేడీఎస్ ఓ తురుపుముక్క. ఆ పార్టీ తన అవసరం కోసం ఎవరితోనైనా కలుస్తుంది. అది దాని ఇష్టం. దానికి తెలంగాణ రాజకీయాలకు ఏమిటి సంబంధం? మన రాష్ట్రంలో గత ఐదేండ్ల చరిత్రను చూస్తే బీజేపీతో అంటకాగింది ఎవరు? 2019 పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్, నిజామాబాద్ సీట్లలో బీజేపీకి లోపాయికారీ మద్దతు ఇచ్చింది ఏ పార్టీ అభ్యర్థులు? కనీసం ఎన్నికల ప్రచారం కూడా చేయకుండా బీజేపీకి ఓటేయమని కార్యకర్తలకు చెప్పింది ఏ పార్టీ వారు? టీఆరెస్‌ను ఎలాగైనా ఓడించాలని కుట్ర చేశారు కానీ ఏం జరిగింది? ఇవాళ కోరుట్ల–జగిత్యాలలో ఎటువంటి మిలాకత్ జరుగుతున్నది? ఇలాంటి వెన్నుపోట్ల వల్ల కేంద్రంలో బీజేపీ 300 సీట్లు దాటింది. కాంగ్రెస్‌కు రావాల్సిన ఒకటి రెండు సీట్లు రాకుండాపోయాయి. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు సహకరించింది నిజం కాదా?

హుజూరాబాద్‌లో బలహీనమైన అభ్యర్థిని నిలిపి బీజేపీకి లోపాయికారీ మద్దతు ఇవ్వలేదా? ఆఖరికి మునుగోడు ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీ అవగాహన మీద ఈటల చేసిన ఆరోపణ ఏం చెప్తున్నది? రాష్ట్రంలో బీజేపీతో ఏండ్లకేండ్లు ప్రాక్టికల్‌గా కుమ్మక్కైంది ఎవరు? కాంగ్రెస్ పార్టీ కాదా? దేశ రాజకీయాల్లో మాత్రం తక్కువా? అరెస్టే ఆలస్యం అనుకున్న నేషనల్ హెరాల్డ్ కేసు హఠాత్తుగా కోల్డ్ స్టోరేజీకి ఎందుకు వెళ్లింది? అదే సమయంలో ప్రధాని మోదీకి స్వరాష్ట్రం గుజరాత్‌లో ఎన్నికలు గెలిచి తీరాల్సిన తప్పనిసరి అయిన స్థితిలో విపక్ష నేతగా అక్కడే తిష్టవేసి ప్రచారం చేయాల్సిన రాహుల్ హఠాత్తుగా కేరళలో జోడో యాత్ర ప్రారంభించి దూరంగా ఎందుకున్నట్టు? గుజరాత్ ఎన్నికల్లో కేవలం ఒకే సభతో ప్రచారాన్ని మమః అని ఎందుకు అనిపించినట్టు? ఇక హిమాచల్ ఎన్నికలకే ఎందుకు డుమ్మా కొట్టినట్టు? ఎవరి మేలు కోసం? ఇందులో మతలబు ఏమిటి? సమాధానం చెప్పగలరా?

ఇవాళ ఎవరో ఏదో తమ రాజకీయ ప్రయోజనాలు చేజారుతున్నాయని.. ఓటమి అంచులోకి జారిపోతున్నామని.. తమ ఎత్తుగడలు ఎదురు తిరుగుతున్నాయని గింజుకుంటూ వేసే అభాండాలతో, చేసే ఆరోపణలతో నమస్తే చరిత్ర మాసిపోదు. మొదట్లో చెప్పినట్టు ఎవరి చరిత్ర వారే తమ చేతల ద్వారా రాసుకుంటారు. ఓట్ల కోసం ప్రజాప్రతినిధులను కొనడానికి వెళ్లిన చరిత్ర ఎవరు రాసుకున్నారు? కార్యకర్తలను పక్కకు ఈడ్చి పడేసిన చరిత్రను.. కాళ్లతో తొక్కిపడేసిన చరిత్రను ఎవరు రాసుకున్నారు. తెలంగాణవాదుల మీదికి తుపాకులు ఎక్కుపెట్టిన చరిత్ర ఎవరు రాసుకున్నారు? రాజకీయ సన్యాసం అంటూ సవాళ్లు విసిరిపారిపోయిన పిరికి చరిత్ర ఎవరు రాసుకున్నారు? ఆరోపణలు చేసి బూమరాంగ్ అయి తేలు కుట్టిన దొంగల్లా తల దించుకున్న చరిత్రలు ఎవరు రాసుకున్నారు? ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల సమయంలో ప్రత్యర్థులపై బూతులు మాట్లాడిన చరిత్ర ఎవరు రాసుకున్నారు?

ఎస్.. మేం నిలబడతాం. కచ్చితంగా నిలబడతాం. ఇంకా ఇంకా గట్టిగా నిలబడతాం. తెలంగాణను ఈనగాచి నక్కల పాలు.. గుంట నక్కల పాలు కానివ్వం. పల్లెలు పచ్చబడి.. పట్నాలు తెల్లబడి.. రాజధాని విశ్వనగరంగా మారి వేల కోట్ల సంపద సృష్టి జరిగి దేశాన్ని సాకే రాష్ట్రాల్లో చేరిన సమయంలో ఆ సంపదను దోచుకోవడానికి ఢిల్లీ బంట్లు, గుజరాత్ గులాములు, కర్ణాటక బ్రోకర్లు, అపర గజనీలు ఘోరీల్లా దాడులు చేస్తుంటే చేతులు ముడుకొని కూర్చోబోము. కచ్చితంగా ఎదుర్కొంటాం. ప్రజలను చైతన్యపరిచి ఈ మూకలను తరిమి తరిమికొడతాం. అది పచ్చముఠాలు కావచ్చు.. ఢిల్లీ బాస్‌లు కావచ్చు.. డోంట్ కేర్!!!

- నమస్తే తెలంగాణ సంపాదక మండలి

9 మంది అగ్నికి ఆహుతి

- 21 మందిని కాపాడిన సిబ్బంది.. నాంపల్లిలో ఘోర అగ్ని ప్రమాదం
- అపార్టుమెంట్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో అనధికార కెమికల్ గోడౌన్
- పటాకుల నిప్పు రవ్వలా, షార్ట్ సర్క్యూటా? కారణమేంటి?
- ఘటనపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్ సిటీబ్యూరో/అబిడ్స్/సుల్తాన్ బజార్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): నాంపల్లిలో అనధికార కెమికల్ గోడౌన్‌లో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి 9 మంది దుర్మరణం చెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది మరో 21 మందిని రక్షించారు. రోడ్డు పై కాల్చిన పటాకుల నిప్పు రవ్వలు కెమికల్ గోడౌన్లలోకి దూసుకెళ్లడం లేదా, గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. నాంపల్లి బజార్‌ఘట్‌లోని తన అపార్టుమెంట్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో వ్యాపారి రమేశ్‌కుమార్ జైస్వాల్ ప్లాస్టిక్, ఫైబర్ షీట్స్, కలర్‌లో కలిపే మిథైల్ బెంజిన్‌తో కూడిన పెట్రోలియం స్వభావాన్ని కలిగి ఉన్న కెమికల్ డ్రమ్‌లను నిల్వ చేస్తున్నాడు. అనధికారంగా గోడౌన్ నిర్వహిస్తున్నాడు. ఈ సామగ్రిని హోల్‌సేల్‌గా వివిధ వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. నాలుగో అంతస్థులోని ఫ్లాట్లను ఎనిమిది కుటుంబాలకు అద్దెకు ఇచ్చాడు. కుటుంబాల వాహనాలను కూడా గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పార్కింగ్ చేస్తారు. ఉదయం 9.30 సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి పొగలొచ్చాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపకశాఖకు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది ఘటనా స్థలికి ఫైరింజన్లతో చేరుకున్నారు. మంటలు ఆర్పివేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మండే స్వభావం ఉన్న రసాయన డ్రమ్ములు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. పై అంతస్థులో నివాసముంటున్న కుటుంబాలకు కింద ఏదో ప్రమాదం జరిగిందని గుర్తించి.. బయటకు వచ్చే సరికే గ్రౌండ్ ఫ్లోర్‌లో పూర్తిగా మంటలు వ్యాపించాయి. భవనం చుట్టూ దట్టమైన పొగలు అలుముకున్నాయి. మొదటి అంతస్థులో ఉన్న వారిలో ఒకరిద్దరు మినహా అందరూ బయటకొచ్చారు. ఆపై అంతస్థులో ఉన్నవారు మంటలు దాటుకొని కిందకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఒకపక్క అగ్నిమాపక అధికారులు మంటలను ఆర్పుతూనే, మరో పక్క పైఅంతస్థులో చిక్కుకున్న వారిని నిచ్చెనల సహాయంతో రక్షించారు. అగ్నిమాపకశాఖ, జీహెచ్ఎంసీ రెస్క్యూ ఆపరేషన్‌లో 21 మందిని కాపాడారు. అప్పటికే పొగ అపార్టుమెంట్ మొత్తం వ్యాపించింది. ప్రమాదంతో వెలువడిన కార్బన్ మోనాక్సైడ్ పీల్చుకోవడంతో ఐదుగురు ఇండ్లలోనే కుప్పకూలిపోయారు. మరో నలుగురు బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తూ పొగ పీల్చుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లి మంటల్లో చిక్కుకొని మృతి చెందారు.

నాంపల్లి బజార్‌ఘట్‌లోని అపార్టుమెంట్‌లో ఎగిసిపడుతున్న అగ్ని కీలలు

సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

అగ్నిప్రమాదంపై సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తీవ్ర సానుభూతి తెలిపారు. తక్షణమే పటిష్ఠ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడినవారికి మెరుగైన వైద్యం అందించాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

దురదృష్టకరం: కేటీఆర్

బజార్‌ఘట్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటన చాలా దురదృష్టకరమని మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన ఘటనాస్థలిని సందర్శించారు. ప్రమాద కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అగ్నిప్రమాద ఘటన స్థలిని హోంమంత్రి మహమూద్ అలీ సందర్శించారు. అగ్ని ప్రమాదానికి ఇంటి యజమాని రమేశ్ జైస్వాల్ కారణమని, ఆయనపై కేసు నమోదు చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు చెప్పారు. అనధికారికంగా అపార్టుమెంట్‌లో కెమికల్ గోడౌన్ నిర్వహిస్తున్న రమేశ్ జైస్వాల్‌పై 304 పార్ట్ 2 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు పేర్కొన్నారు.

మృతుల వివరాలు..

రిటైర్డ్ డాక్టర్ ఎండీ జాకీర్ హుస్సేన్ (66), ఉపాధ్యాయురాలైన ఆయన భార్య నికత్ సుల్తానా (55), వ్యాపారి ఎండీ ఆజమ్ (57), ఆయన భార్య రహమాన్ సుల్తానా (50), కొడుకు హసెబుర్ రహమాన్ (32), కూతురు ఫైజా (26) సమీనా ఉన్నారు. మరో కుటుంబంలో ముక్రమ్ భార్య తహూరా ఫర్హానా(35) ఆమె కూతుళ్లు తరోబ (13), మన్హ (6) ఉన్నారు.

జూపల్లికి పరాభవం

కొల్లాపూర్: కొల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావుకు సొంత ఊరిలో పరాభవం ఎదురైంది. సోమవారం చిన్నంబావి మండలం పెద్దదగడలో ఆయన మాట్లాడుతుండగా మహిళలు అడ్డుకున్నారు. 19 ఏండ్లు అధికారంలో ఉండి గ్రామాన్ని ఏం చేశావని నిలదీశారు. దీంతో సహనం కోల్పోయిన జూపల్లి ఆగ్రహంతో ఊగిపోయారు. ఏమీ చేయలేక అక్కడి నుంచి వెనుదిరిగారు.

గువ్వలపై మళ్లీ రాళ్ల దాడి

- ఆగని కాంగ్రెస్ నేతల ఆగడాలు
- అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లిలో ‘హస్తం’ దౌర్జన్యం

అచ్చంపేట/అమ్రాబాద్, నవంబర్ 13 : కాంగ్రెస్ నేతల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. బీఆర్ఎస్ అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై మరోసారి దాడికి తెగబడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని కుమ్మరోనిపల్లి గ్రామానికి వెళ్లారు. ఎమ్మెల్యే రాకను గ్రామస్థులు ఘనంగా స్వాగతించారు. డ్యాన్స్‌లు, కోలాటాలు, నృత్యాలు చేస్తూ ఎమ్మెల్యేపై ఉన్న అభిమానాన్ని చాటుకొన్నారు. దీనిని జీర్ణించుకోలేని కుమ్మరోనిపల్లి కాంగ్రెస్ కార్యకర్త తిరుపతయ్య ఇటుకరాయితో ఎమ్మెల్యే గువ్వలపై దాడి చేశాడు. దీంతో ఆ ఇటుకరాయి ఎమ్మెల్యే చేతిని గాయపరిచి, పక్కనే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తకు తగిలింది. దాడికి పాల్పడిన తిరుపతయ్యను గ్రామస్థులు పోలీసులకు పట్టించారు. కాగా, ఎమ్మెల్యే గువ్వలను కాంగ్రెస్ ముఠా హతమార్చడమే లక్ష్యంగా అడుగడుగునా రెక్కీ నిర్వహిస్తూ దాడులకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ వర్గాలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల అచ్చంపేటలో స్వయంగా కాంగ్రెస్ నేత వంశీకృష్ణ రాయితో దాడి చేసిన ఘటనలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు పెద్ద ప్రమాదం తప్పి, గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మరువకముందే మరోసారి ఎమ్మెల్యేపై దాడి చేయడం ఆ పార్టీ నేతల అసలు స్వరూపాన్ని అర్థం చేసుకోవచ్చు.

కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణతో తిరుపతయ్య (దాడికి పాల్పడిన వ్యక్తి)

కాంగ్రెస్ పార్టీ నేతల దాడులను ప్రజలు గమనిస్తున్నారు

కాంగ్రెస్ పార్టీ దాడులతో ప్రజల్లో భయాందోళన సృష్టించి ఓట్లు వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నదని, ప్రజలు వీటిని గమనిస్తున్నారని, తనకు ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు తనను ఎవరూ ఏమీ చేయలేరని ఎమ్మెల్యే గువ్వల ఉద్వేగ ప్రసంగం చేశారు. ప్రజల మనసును గెలిచి తాను రెండుసార్లు ఎమ్మెల్యేనయ్యానని.. మరోసారి ప్రజల ఆశీర్వాదంతో ముచ్చటగా మూడోసారి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిదాడులు చేయొద్దని, సంయమనం పాటించాలని.. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రత్యర్థులకు బుద్ధి చెప్పేలా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ దాడుల సంస్కృతిని అచ్చంపేట ప్రజలు అర్థం చేసుకొని ఆ పార్టీ నేతలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. అచ్చంపేట ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని, అచ్చంపేట ప్రజల కోసం తాను చావడానికైనా సిద్ధమేనని గువ్వల పేర్కొన్నారు.

బీజేపీ అభ్యర్థి చలమల్లపై భూకబ్జా ఆరోపణలు

- 200 ఎకరాలు కబ్జా చేశాడంటూ బాధితుల గగ్గోలు
- ఆ భూమి విలువ దాదాపు రూ.1,200 కోట్లకుపైనే..

మునుగోడు, నవంబర్ 13: మునుగోడు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన చలమల్ల కృష్ణారెడ్డిపై భారీ భూకబ్జా ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. బాధితుడు కృష్ణ తన తల్లి భూలక్ష్మితో కలిసి సోమవారం మునుగోడులో మీడియా ముందుకు వచ్చారు. కృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. ‘హయత్‌నగర్ మండలం తారామతిపేటలోని 242, 243, 244, 245 సర్వే నంబర్లలో సుమారు 200 ఎకరాల ఇనాం భూమికి మా తాత మూల స్వామి ఇనాందారుగా ఉన్నారు. ఆయన కుమారుడు మూల అంజయ్య 1985లో ఈ భూమిపై ఇంజక్షన్ ఆర్డర్ తీసుకోగా.. లీగల్‌గా ఎదుర్కోలేక 2000 సంవత్సరంలో చలమల్ల కృష్ణారెడ్డి, ఆయన అనుచరులు కలిసి ఆయన్ని అదృశ్యం చేశారు. ఆయన సోదరి భూలక్ష్మి.. తమ్ముడి అదృశ్యంపై పోలీసులను ఆశ్రయించి కేసు పెట్టారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తన తండ్రి నుంచి వచ్చిన వారసత్వంగా వచ్చిన భూమిని చలమల్ల కృష్ణారెడ్డి, ఆయన అనుచరులు కబ్జా చేస్తున్నారంటూ 2007లో కోర్టును ఆశ్రయించారు. కోర్టు భూలక్ష్మి పేరిట ఈ భూమిపై ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా పోలీసులు చర్యలు తీసుకోలేదు. దాంతో హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ సంతోష్‌రెడ్డి సీబీఐ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దానిని బెంచ్‌పైకి రాకుండా చలమల్ల కృష్ణారెడ్డి అడ్డుకున్నాడు’ అని బాధితుడు కృష్ణ పేర్కొన్నాడు. సీబీఐ విచారణ నుంచి తప్పించుకునేందుకే చల్లమల్ల బీజేపీలో చేరాడని ఆరోపించారు. ఆయన నుంచి తమకు ప్రాణహాని ఉన్నదని, తమను కాపాడాలని వేడుకున్నారు.


మునుగోడులో మీడియా ఎదుట భూ పత్రాలను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న కృష్ణ, బాధితులు

ముస్లిం కుటుంబంపై కాంగ్రెస్ కౌన్సిలర్ దాడి

- బీఆర్ఎస్ వీడనందుకు వేధింపులు
- మున్సిపల్ జవాన్ ఉద్యోగం నుంచి తొలగింపు
- అయినా ససేమిరా అనడంతో ఇంటిపై కాంగ్రెస్ కౌన్సిలర్ దాడి

నీలగిరి, నవంబర్ 13: తమతోపాటు పార్టీ మారనందుకు కక్ష పెంచుకుని ఓ ముస్లిం కుటుంబాన్ని కాంగ్రెస్ కౌన్సిలర్ దంపతులు వేధింపులకు గురి చేస్తున్నారు. ఉద్యోగం ఊడగొట్టించడంతోపాటు ఇంటిపైకి భౌతికదాడులకు పాల్పడ్డారు. ఈ ఘటన నల్లగొండ పట్టణం 16వ వార్డు ఆర్జాలబావిలో ఆదివారం జరిగింది. 16వ వార్డు కౌన్సిలర్ జెర్రిపోతుల అశ్వినీభాస్కర్‌గౌడ్ బీఆర్ఎస్‌ను వీడి ఇటీవల కాంగ్రెస్ చేరారు. కౌన్సిలర్ వెంట శ్రేణులెవరూ కాంగ్రెస్‌లో చేరలేదు. ఇదేక్రమంలో మున్సిపల్ శాఖలో జవాన్‌గా పనిచేసే వ్యక్తి, అదే వార్డుకు చెందిన షేక్ అన్వర్‌కు స్థానికంగా మంచి పేరున్నది. కౌన్సిలర్ దంపతులు అతన్ని కాంగ్రెస్‌లోకి రావాలని ఒత్తిడి చేశారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తమకేం అన్యాయం చేయలేదని పేర్కొంటూ వారు కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో వారు అన్వర్‌పై కక్ష పెంచుకున్నారు. సహచర కౌన్సిలర్ సహకారంతో అన్వర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. అయినా అన్వర్ దారికి రాకపోవడంతో కౌన్సిలర్ భర్త, ఆయన అనుచరులు అన్వర్ ఇంటిపైకి వెళ్లి దాడి చేశారు. కాలనీవాసులు ఏకమై కౌన్సిలర్ దంపతులు, అనుచరులను అడ్డుకున్నారు. విషయం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. దీంతో కోమటిరెడ్డి అనుచరులతో కలిసి నేరుగా ఘటనా స్థలానికి చేరుకుని కౌన్సిలర్‌పైనే దాడి జరిగినట్టు చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ముస్లిం యువకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆర్జాలబావికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దాంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను తిప్పిపంపారు. అనంతరం ఆయా పార్టీల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై నల్లగొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కౌన్సిలర్ దంపతుల నుంచి తనకు ప్రాణహాని ఉన్నదని, రక్షణ కల్పించాలని షేక్ అన్వర్ పోలీసులను కోరారు.

తనపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ధర్నా చేస్తున్న అన్వర్, కుటుంబ సభ్యులు